క్లుప్తంగా

బాలచౌడేశ్వరిదేవి గ్రామోత్సవం



సంగం: సంగంలో కొలువైన బాలచౌడేశ్వరిదేవి గ్రామోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు బాలచౌడేశ్వరిదేవి అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేష పూలతో అలంకరించి గ్రామంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

డీఏ మంజూరుపై హర్షాతిరేకాలు

సోమశిల: ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌టీఎఫ్ డివిజన్ అధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి తెలిపారు. డీఏకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడి కృషి చేసిన ఎమ్మెల్సీలు కల్పనా లతారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రామాలయం జీర్ణోద్ధరణ పనులకు భూమిపూజ



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్న ఉరిబిండి ప్రభాకర్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులో కొలువైన రామాలయం శిథిలావస్థకు చేరడంతో జీర్ణోద్ధరణ పనులను కాంట్రాక్టర్ ఉరిబిండి ప్రభాకర్‌రెడ్డి స్వీయ నిధులతో చేపట్టేందుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పురోషోత్తం చారి, గ్రామ నాయకులు బొద్దుకూరు వెంకటేశ్వర రెడ్డి, మహేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

పెన్‌కాక్ సిలాట్ విజేతకు అభినందనలు



పెన్‌కాక్ సిలాట్‌లో బంగారు పతకం విజేత సాయికిరణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన విద్యార్థి పి.సాయికిరణ్ ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ క్రీడలో బంగారు పతకం సాధించడంతో స్థానిక కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఒంటేరు మల్లికార్జున ఆ విద్యార్థినిని బుధవారం అభినందించారు. శాలువా కప్పి పూలమాల వేసి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. ఆ విద్యార్థికి క్రీడలపై ఆసక్తి ఉందని దాతలు అతన్ని ప్రోత్సహించాలని కోరారు.

చిన్నారి వైద్యానికి రూ.1.36 లక్షల సహాయం



లిఖిత తండ్రికి నగదును అందజేస్తున్న సేవియర్స్ సేవా సంస్థ ప్రతినిధులు

కావలి: కాలేయ సమస్యతో బాధపడుతున్న సంయుక్త సేవ సంస్థ సురేంద్ర కుమార్తె లిఖితకు సేవియర్స్ సేవా సంస్థ రూ.1.36 లక్షలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. మూడు రోజుల క్రితం కాలేయ సమస్యతో చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన కావలికి చెందిన గంగపట్నం లిఖితకు సేవియర్స్ ఆర్థిక తోడ్పాటును అందించారు. లిఖితకు రోజుకు సుమారు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని తెలిసిన వెంటనే వివిధ సామాజిక మాధ్యమాల లిఖిత ఆరోగ్య పరిస్థితిని వివరించి కేవలం మూడు రోజుల్లోనే రూ. 1,36,000 సేకరించి చెన్నై అపోలో లిఖితతో పాటు ఉన్న ఆమె తండ్రి సురేంద్రకు అందజేశారు. సేవియర్ సభ్యులు భార్గవ్, రాజేష్ మాట్లాడుతూ లిఖితకు ఆర్థిక అవసరం ఉందని తెలపగానే దాతృత్వం చూపిన దాతలందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

మద్యం పట్టివేత

కావలి: మండలంలోని గౌరవరం దాబాల వద్ద అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తుండడంతో కావలి రూరల్ ఎస్సై శెట్టిపల్లి సుమన్ బుధవారం తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన తుమ్మల మాల్యాద్రి కావలి నుంచి మద్యం బాటిళ్లు తెచ్చి అధిక రేట్లకు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి అతని వద్ద 21 క్వార్టర్ మద్యం బాటిళ్లు, రూ.1700 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత కల.. సాకార వేళ

- 2 వేల మందికిపైగా ఉద్యోగాల కల్పన
- నవంబరు 2 ఎంజీఆర్ జయంతి రోజున జాబ్‌మేళా
- హాజరు కానున్న ప్రముఖ కంపెనీలు



ఆత్మకూరు: మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరితో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రెండు మెగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువత కలలు సాకారం చేశారు. తాజాగా తన సోదరుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఆయన జయంతి రోజు నవంబరు 2న మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 30కి పైగా ప్రముఖ కంపెనీలు, సంస్థలను ఈ జాబ్‌మేళాకు ఆహ్వానించారు. దాదాపు 2 వేల మందికిపైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఆత్మకూరుతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలైన కియా మోటార్స్, బ్రిటానియా ఇండస్ట్రీస్, సైయెంట్ గ్లోబెల్, బ్రిగేడ్ కంపెనీ, సెంచూరీ ఫ్లెబ్లైర్డ్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, రిలయన్స్, నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, ప్రభాస్ వీ కేర్ హెల్త్ క్లినిక్, అపోలో ఫార్మసీ, వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్, అమర్ రాజా బ్యాటరీస్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఇన్సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, సెర్ప్ వే గ్లోబెల్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం, ఆటో సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, తదితర కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయి. చదువుకుని ఉద్యోగాలు లేవని నిరాశ చెందే నిరుద్యోగ యువతకు ఇదొక వరం కానుంది.

మంచి అవకాశం వినియోగించుకోండి



ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నాను. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగ యువత తమ చదువులకు తగిన ఉద్యోగం లభించడం లేదని నా దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఏడీఎఫ్ సహకారంతో పలు ప్రముఖ కంపెనీలను ఒకే చోట చేర్చి వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎమ్మెల్యే

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదల ఆరోగ్య హక్కు



కంటి పరీక్షలకు వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్య హక్కుగా నిర్వహిస్తున్నట్లుగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 28, 30 వార్డుల్లో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల ఆరోగ్యానికి రక్షగా నిలిచారన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. వైద్య–ఆరోగ్య రంగంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్స్ పర్యవేక్షణలో, ఉచితంగా వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. అవసరమైన వారిని పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేసి, ఉచితంగా ప్రభుత్వమే శస్త్ర చికిత్సలు చేయిస్తుందన్నారు. టోకెన్ లేని వారు కూడా నేరుగా శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైద్య సేవలను అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను స్వయానా దగ్గర ఉండి పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 7 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 172 రకాల మందులను కూడా ఉచితంగా అందజేసి పేదలందరి ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్న ప్రభుత్వమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వర రెడ్డి, సున్నా మురళి, అమరా శ్రీనివాసులు, దావులూరి పవిత్రన్, గంగు వెంకట చంద్రశేఖర్, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, మండలి కృష్ణారావు, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరి చిన్న పుల్లయ్య, పుల్లా శ్రీనివాసులురెడ్డి, పానుగోటి అనురాధ, అమరా వేదగిరి, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టండి



పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి

సోమశిల: ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి సూచించారు. బుధవారం అనంతసాగరం మండలం మంచాలపల్లి పంచాయతీ జంగాలకాలనీలో ఉన్న ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రౌండ్ లేక ఇబ్బందులు పడుతున్నారని, వంట గది ఏర్పాటు చేయాలని ఎంఈఓ ఎం.బాలకృష్ణారెడ్డి జెడ్పీటీసీ రాపూరును కోరారు. జెడ్పీ నిధుల్లో గ్రౌండ్ లెవల్ కోసం, వంట గది నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలకు అవసరమైన కంప్యూటర్, జిరాక్స్ మెషిన్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు అల్లంపాటి మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

బోర్డు సూచన మేరకే పొగాకు పండించాలి



డీసీపల్లి వేలం నిర్వహణాధికారి రాజశేఖర్

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని పొగాకు రైతులు బోర్డు సూచించిన మేరకే పొగాకును పండించాలని డీసీపల్లి వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఒక బ్యారెన్‌కు 2.9 హెక్టార్లలోపు మాత్రమే పంట వేయాలని, రైతులు పొగాకు పంట తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు.

రేషన్ సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదు

ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి పంచాయతీ కొట్టాలపల్లి బీసీ కాలనీ వాసులకు ఈ నెలలో ఇంత వరకు రేషన్ సరుకులు ఇవ్వలేదని బుధవారం పలువురు కాలనీవాసులు తహసీల్దార్ సానా శ్రీనివాసులరెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తాము రేషన్ ఎండీయూ ఆపరేటర్‌ను అడిగితే డీలరు తన వద్ద బియ్యం స్టాక్ లేవంటున్నాడని తెలిపారన్నారు. తమకు బియ్యం ఇవ్వడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విచారించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

ఆర్డీఓను కలిసిన ఎంవీఐ



ఆర్డీఓ మధులతకు అభినందనలు తెలుపుతూ మొక్కను అందజేస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారిణిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కురబ మధులతను పలువురు అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. బుధవారం ఎంవీఐ ఎం.రాములు ఆమె కార్యాలయం వద్ద ఆమెను కలిసి మొక్కను అందజేసి అభినందించారు. ఆత్మకూరు ప్రాంతంలో రవాణాశాఖ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయని ఆమె ఎంవీఐని అడిగి తెలుసుకున్నారు. పలు మండలాల తహసీల్దార్లు ఆమెను కలిశారు.

దేవాలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజలో టౌన్ అధ్యక్షుడు దండా కృష్ణా రెడ్డి

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీ పరిధి చెర్లోసంఘంలో సీతారాములస్వామి దేవాలయ ప్రహరీ గోడ శంకుస్థాపన బుధవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, టౌన్ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి భూమి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు కరేటి దైవాదీనం, షేక్ ఉస్మాన్, చంతాటి కరుణాకర్, బత్తల మోహన్‌రెడ్డి, బత్తల సుధాకర్, షేక్ రసూల్, పరిశినేటి కళ్యాణ్, దాసరి శ్రీహరి, చెంతాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయండి



రీసర్వే రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హనక్‌బాబు

అనుమసముద్రంపేట: మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ హనక్‌బాబు అన్నారు. మండలంలోని పందిపాడులో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష కార్యక్రమంలో భాగంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు రీసర్వే పనులు చేపట్టినట్లు తెలిపారు. రైతులు భూములను రీసర్వే అనంతరం రికార్డులు తయారు చేసి కంప్యూటర్లలో భద్రపరుస్తామని వివరించారు. రైతులు ఈ రీసర్వే పనులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి, వీఆర్‌ఓ హజరత్తయ్య, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళా బృందం

ఉదయగిరి: పట్టణంలోని ఏపీజీబీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జి.అయ్యవారిపల్లెలో ఆర్థిక అక్షరాస్యతపై జరిగింది. సహాయ మేనేజర్ దొరబాబు మాట్లాడుతూ నాబార్డ్ సౌజన్యంతో చైతన్య కళా బృందం బ్యాంకు పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, జీవన సురక్ష, అటల్ పెన్షన్ పథకాలపై బ్యాంకు రుణాలపై కళా ప్రదర్శన ద్వారా అవగాహన పెంపొందించామన్నారు. తమ బ్యాంకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు, కో–ఆర్డినేటర్ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



మెయిన్ బజారులో రేకులు తొలగించి లోపలే నిర్మాణాలు చేపడుతున్న గదులు

ఆత్మకూరు: పట్టణంలోని మెయిన్ బజారు సోమశిల రోడ్డు మలుపులో మున్సిపల్ అధీనంలోని పలు వ్యాపార గదులను రేకులు తొలగించి ఎలాంటి అనుమతులు లేకుండా పక్కా శ్లాబులు వేస్తున్నారు. నాలుగు రోజులుగా పలువురు వ్యాపారులు చేస్తున్నా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి తాము నిర్వహిస్తున్న వ్యాపార గది ఎలాంటి మార్పు, చేర్పులు చేయాలన్నా మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాలి. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానాలు ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదంతో నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, అలాంటి ప్రక్రియలు లేకుండానే అధికారులను లోబరుచుకుని కొందరు వ్యాపారులు తమ దుకాణాలకు శ్లాబులు వేసి ముందుకు చొచ్చుకొస్తున్నారు. మెయిన్ బజారులోని రెండు గదులకు మూడు రోజుల వ్యవధిలో రాత్రి సమయాల్లో శ్లాబులు వేయగా, సమీపంలోని మరో రెండు వ్యాపార గదుల నిర్వాహకులు రేకులు తొలగించి పిల్లర్స్ వేసి పక్కనే నిర్మాణాలే చేపట్టారు. వెలుపలకు ఏమి కనిపించకుండా షట్టర్లు వేసి, వెలుపలి గోడలు తొలగించకుండా లోపలే పనులు చేస్తుండడం గమనార్హం. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావును సంప్రదించగా ఒకరికి నోటీసులు ఇచ్చామని, మిగిలిన నిర్మాణాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మితిమీరిన వేగం ప్రాణాంతకం



డీసీపల్లి టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ వేణు

మర్రిపాడు: హైవేపై ప్రయాణాలు సాగించే వాహన చోదకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని ఆత్మకూరు సీఐ జీ వేణు సూచించారు. బుధవారం సాయంత్రం మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. పలువురు వాహనచోదకులను నిలిపి పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను తమ వెంట ఎప్పుడూ ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మర్రిపాడు పోలీసు సిబ్బంది ఉన్నారు.

చింతాలమ్మకు పొంగళ్లు

చేజర్ల: మండలంలోని యనమదల చింతాలమ్మ గుడిలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పొంగళ్లు పెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, సర్పంచ్ సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి

అల్లూరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు జిల్లా రీజనల్ మేనేజర్ టి మోహన్‌రెడ్డి ఖాతాదారులను, ప్రజలను కోరారు. అల్లూరు ఉద్దీపగుంట ఎస్టీ కాలనీలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం కళాజాత నిర్వహించారు. తొలుత మొక్కలను నాటారు. తోలుబొమ్మలాట, కోలాటం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ తమ శాఖ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడానికి సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో అల్లూరు శాఖ 100 శాతం పథకాల అమల్లో ముందుందని తెలిపారు. ఖాతాదారులతో స్నేహ పూరితంగా ఉండి బ్యాంక్ ద్వారా ఉత్తమ సేవలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మల్లికార్జున, అల్లూరు శాఖ మేనేజర్ టీవీ కృష్ణకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాసరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య సురక్ష

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి కుటుంబానికి రక్ష అని పలువురు వక్తలు చెప్పారు. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించారు. అవసరమైన వారికి మందుల కిట్లను అందించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.



అనుమసముద్రంపేట: గుడిపాడులో జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, వైద్య సిబ్బంది తదితరులు



వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణులు



సంగం: సిద్ధీపురం వైద్య శిబిరంలో మెడికల్ స్టాళ్లను పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ గోపి, సర్పంచ్ ప్రసన్న, డాక్టరు శ్రీనివాసులరెడ్డి తదితరులు



ఉదయగిరి: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, చిత్రంలో ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ గాజుల తాజుద్దీన్ తదితరులు



కొండాపురం: వెలిగండ్ల వైద్య శిబిరంలో కంటి అద్దాలు అందిస్తున్న వెలిగండ్ల, మర్రిగుంట సర్పంచ్‌లు చిన్నక్క, దార్ల గోపీ తదితరులు



కలిగిరి: నాగసముద్రంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరావు, చిత్రంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ దమ్ము శ్రీనివాసులు

పశువైద్యశాలకు కొత్త రూపు



రైతుల సహకారంతో రూపుమారిన ఆత్మకూరు పశు సంవర్ధక శాఖ ఏడీఏ కార్యాలయం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని పశువైద్య సహాయ సంచాలకుల కార్యాలయానికి రైతుల సహకారంతో కొత్త రూపు వచ్చింది. ఆత్మకూరు పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ జయచంద్ర సమాచారం మేరకు పశు వైద్యశాల భవనంతో పాటు ప్రహరీ గోడలు, చిన్నపాటి మరమ్మతులకు గురయ్యాయి. ఆత్మకూరు, పేరారెడ్డిపల్లి రైతులు స్వచ్ఛందంగా విరాళాలు పోగు చేసి ఆయా భవనాలకు మరమ్మతులు చేయించడంతో పాటు పెయింటింగ్ పనులు చేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సహకరించిన రైతులు అందరికీ ఏడీఏ జయచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరు: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మున్సిపల్ 17, 19, 20 వార్డుల ప్రజల కోసం మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అర్బన్ హెల్త్ కేంద్రంలో నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరంలో పలు రకాల రోగాలకు వైద్య సేవలు అందించేందుకు ప్రముఖ డాక్టర్లు పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.